ఇంకెన్నాళ్లిలా?



కొత్తగా వేసిన విద్యుత్ స్తంభాలు ఇవే..



గురునానక్‌కాలనీ రోడ్డుమీద అడ్డంగా విద్యుత్ స్తంభాలు ఉండటం వల్ల ఏర్పడిన ట్రాఫిక్

స్తంభాలు వేశారు.. కనెక్షన్లు మరిచారు!

- రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలతో ఇబ్బందులు
- కొత్త స్తంభాలు రోడ్డుకు పక్కనే వేసినా.. కొత్త లైన్లు వేయని వైనం
- తరచూ ట్రాఫిక్ సమస్యలతో గురునానక్ కాలనీ వాసుల ఇబ్బందులు
- పట్టించుకోని విద్యుత్ అధికారులు

ఆటోనగర్(విజయవాడతూర్పు): గురునానక్ కాలనీ.. విజయవాడలో అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రాంతం. నిత్యం వందల కొద్దీ వాహనాల రాకపోకలు, రహదారికి ఇరువైపులా చిరువ్యాపారులు, పెద్ద పెద్ద హోటల్స్, భారీగా షాపింగ్ కాంప్లెక్స్‌లు ఉంటాయి. ఆటోనగర్ వెళ్లేందుకు గాను ఆర్టీసీ బస్సులు కూడా ఈ ప్రాంతం గుండానే రాకపోకలు సాగిస్తుంటాయి. పలువురు మంత్రులు.. ఉన్నతాధికారులు కూడా ఇక్కడ నివసిస్తుంటారు. మంచి వ్యాపార కూడలిగా ఇది పేరు గాంచింది. అటువంటి ప్రాంతంలో ప్రధాన రహదారిపై అడ్డంగా విద్యుత్ స్తంభాలు ఉండటంతో తరచూ ట్రాఫిక్ జాం అవుతోంది. వాటిని తొలగించి, వేరే స్తంభాలతో కొత్త లైన్లు వేసేందుకు పనులు సైతం విద్యుత్ అధికారులు పనులు ప్రారంభించారు. కొత్త స్తంభాలను రోడ్డుకు పక్కన ఏర్పాటు చేశారు. అయితే కొత్త లైన్లు వేయకుండా అలానే వదిలేశారు. దీంతో సమస్య మరింత జటిలం అవుతోంది. ఈ కొత్త లైన్ల విషయంలో విద్యుత్ అధికారులు నిమ్మకునీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని వాహనదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బిల్లులు పెండింగ్..

అయితే ఈ కొత్త లైన్లు మార్చాలంటే నగరపాలక సంస్థ అధికారులు తమకు రూ. 5లక్షలు చెల్లించాల్సి ఉందని విద్యుత్ శాఖాధికారులు చెబుతున్నారు. ఇప్పటికే చేసిన పనులకు సంబంధించిన నగదు రావాల్సి ఉందని, అవి చెల్లిస్తే పనులు ప్రారంభిస్తామని చెబుతున్నారు. దీనిపై సాక్షి విద్యుత్ శాఖ ఏడీఏ ఎం. శివకుమార్‌ని వివరణ కోరగా.. విద్యుత్ శాఖకు నగరపాలక సంస్థ పెండింగ్ నగదు చెల్లించాల్సి ఉందని.. అవి చెల్లిస్తే వెంటనే పాత స్తంభాలను తొలగించి, కొత్త స్తంభాలకు లైన్లు వేయడం పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

ఇబ్బందికరంగా ఉంది..



నిత్యం ఆటోనగర్‌కు గురునానక్‌కాలనీ రహదారి గుండా రావాలి. రోడ్డుమీద విద్యుత్ స్తంభాలు అడ్డంగా ఉండటం వల్ల రాత్రి సమయాల్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. చాలా తలనొప్పిగా మారింది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు మీద ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగిస్తే.. సమస్య పరిష్కారం అవుతుంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఇక్బాల్, వాహనదారుడు

విపత్తు నిర్వహణపై మాక్ డ్రిల్

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఊర్మిళ నగర్, పాత రాజరాజేశ్వరి పేట, జోజి నగర్ పరిసర ప్రాంతాలలో భారీ వర్షం, వరదలు వచ్చిన సమయంలో ఎటువంటి చర్యలు తీసుకోవాలనే అంశాలపై వీఎంసీ సిబ్బంది ఆయా ప్రాంతాల స్థానికులకు అవగాహన కల్పించారు. మైకుల ద్వారా చైతన్యం కల్పించారు. లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజల విపత్తుల సమయంలో వారికి దగ్గరలో ఉన్న పునరావాస కేంద్రాల గురించి వీఎంసీ సిబ్బంది వివరించారు. విపత్తు సమయంలో ప్రజలకు సహాయపడటానికి వచ్చే సచివాలయం సిబ్బందికి సహకరించాలని సూచించారు. భారీ వర్షాలు కురిసినప్పుడు ఎక్కువగా నీరు నిల్వ ఉండే ప్రదేశాలు, అక్కడ ఇంజినీరింగ్ ప్రజారోగ్య సిబ్బంది తీసుకోవాల్సిన చర్యలు చేపట్టాల్సిన పనులు మాక్ డ్రిల్ రూపంలో చూపించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, శానిటరీ సూపర్‌వైజర్ సోమరాజు, ఇంజినీరింగ్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తున్న వీఎంసీ సిబ్బంది

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కృష్ణలంక(విజయవాడతూర్పు): విద్యుత్ లైన్లు మరమ్మతులు, మెయింటెనెన్స్ కారణంగా కృష్ణలంక సబ్‌స్టేషన్, రాణిగారితోట ఫీడర్‌లో శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ సిటీ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్రబాబు ఓ ప్రకటనలో తెలిపారు. మాదంశెట్టి సీతయ్య వీధి, కోరే నామయ్య వీధి, బాలస్వామి వీధి, సంగుల పేరయ్య వీధి, సిద్ధం కృష్ణారెడ్డి వీధి, చలసాని నగర్, పుట్ట రోడ్డు, ఐస్ ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కాంట్రాక్టర్లకు జరిమానా

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శానిటేషన్, టోల్‌గేట్ కాంట్రాక్టర్లకు ఆలయ ఈవో శీనానాయక్ జరిమానాలు విధించారు. గత ఆదివారం ఘాట్‌రోడ్డులో పార్కింగ్ అస్తవ్యస్తంగా ఉండటం, టోల్‌గేట్ నిర్వహణ సరిగా లేకపోవడంతో టోల్‌గేట్ కాంట్రాక్టర్ వీఎల్‌డీ ఏజెన్సీస్‌కి రూ. 25 వేలు జరిమానా విధించారు. అదే విధంగా ఘాట్‌రోడ్డులోని ఈ టాయిలెట్స్‌కు శానిటేషన్ సిబ్బంది తాళాలు వేయడమే కాకుండా విధుల పట్ల అలసత్వం వహించారంటూ ఏజెల్ సెక్యూరిటీ సర్వీసెస్‌కు రూ. 25 వేలు జరిమానాలు విధించినట్లు ఈవో శీనానాయక్ పేర్కొన్నారు.

జీవితంలో యోగా భాగం కావాలి

పన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రతి వ్యక్తి జీవితంలో యోగ సాధన ఒక భాగంగా మారాలని ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) సీనియర్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ డీఆర్ శర్మ అన్నారు. కేబీఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఇగ్నో కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ భారతీయ వారసత్వ సంపదైన యోగాకు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి రావటం ప్రతి భారతీయుడికి గర్వకారణమన్నారు. యోగ శిక్షకులు డి. హేమచంద్రరావు ఇగ్నో బృందంతో యోగ సాధన చేయించారు. సూర్య నమస్కారాలు చేయాల్సిన విధానాలను వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎన్. సాంబశివరావు, డెప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ బి. ప్రసాద్ బాబు, డాక్టర్ సుమలత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ డీఆర్ శర్మ

కాలం చెల్లిన బస్సులు

- రోడ్లపై మొరాయించడంతో ప్రయాణికుల పడిగాపులు
- కొత్త బస్సుల ఊసే లేదు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

బస్టాండ్(విజయవాడపశ్చిమ): కాలం చెల్లిన ఆర్టీసీ బస్సులతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణం మధ్యలో బస్సులు హఠాత్తుగా ఆగిపోతున్నాయి. డ్రైవర్లు ఎంత ప్రయత్నించినా ముందుకు కదలకుండా మొరాయిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు మరో బస్సునో, ఆటోనో ఆశ్రయించి ప్రయాణాన్ని సాగించాల్సి వస్తోంది. అత్యవసర పనుల కోసం వెళ్తున్న ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల తీరుతో విసుగెత్తిపోతున్నారు.

రోడ్లపై నిరీక్షణ..

పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, వివిధ పనులకు వెళ్లే కూలీలు, ప్రైవేటు ఉద్యోగులు ఎక్కువగా ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తుంటారు. అయితే మొరాయిస్తున్న ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం వారికి గుదిబండగా మారుతోంది. ఎక్కిన బస్సు ఎక్కడ ఆగిపోతుందో తెలియక సమయానికి తాము వెళ్లాల్సిన చోటుకి చేరుకుంటామో లేదో అని ఆందోళనతో నిత్యం రాకపోకలు సాగించాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. బస్సు మొరాయిస్తే మరో బస్సు కోసం గంటల తరబడి రోడ్లపై నిరీక్షించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేటు వాహనాల వైపు మొగ్గు..

ప్రజా రవాణా వ్యవస్థలో అతిపెద్దదిగా గుర్తింపు ఉన్న ఆర్టీసీ క్రమేపీ ప్రయాణికుల ఆదరణకు దూరమవుతోందని పలువురు పేర్కొంటున్నారు. ప్రయాణికుల సౌకర్యాలను పట్టించుకోకపోవడం, రద్దీకి తగినట్లుగా కొత్త బస్సులను ఏర్పాటు చేయకపోవడం, ఎప్పుడు ఆగిపోతాయో తెలియని కాలం చెల్లిన బస్సులను నడపటం ఇందుకు ప్రధాన కారణమనే అభిప్రాయం ప్రయాణికుల నుంచి వినిపిస్తోంది. అయితే తమ ఉన్నతాధికారుల తీరు కారణంగానే ప్రజలు ప్రైవేటు వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారని ఆర్టీసీ సిబ్బంది బహిరంగంగానే చెబుతున్నారు.



సాంకేతిక లోపంతో సింగ్‌నగర్ వద్ద రోడ్డుపై నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

మధ్యలో ఆగిపోతున్న బస్సులు

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం, క్షేమం అని ప్రకటనలు గుప్పించే ఆర్టీసీ అధికారులు తమ ఇబ్బందులను మాత్రం పట్టించుకోవట్లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఎక్కిన బస్సు ఎక్కడపడితే అక్కడ ఆగిపోతే ప్రయాణం ఎలా సురక్షితం అవుతుందని ప్రశ్నిస్తున్నారు. బస్సు ఎక్కి టికెట్ కొని బస్సు ఆగిపోతే తప్పనిసరి పరిస్థితిల్లో తిరిగి ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు. దీంతో రెండు చోట్ల చార్జీలు చెల్లించుకోవడం వల్ల ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేత్రపర్వంగా శ్రీవత్స భరతనాట్య రంగ ప్రవేశం

విజయవాడ కల్చరల్: ప్రవాసాంధ్ర యువ కళాకారుడు ఆకెళ్ల శ్రీవత్స భరతనాట్య సంప్రదాయంలో దుర్గాపురంలోని భారతీ తీర్థ శ్రవణ సదనంలో శుక్రవారం ప్రదర్శించిన అంశాలు నేత్ర పర్వంగా సాగాయి. నృత్య సంప్రదాయాన్ని అనుసరించి పూర్వరంగంతో ప్రారంభించి, పుష్పాంజలి, అలరింపు, జతి స్వరం, శబ్దం, అన్నమయ్య సంకీర్తన, జయదేవుని అష్టపది, పదం, వర్ణం, థిల్లానా అంశాలను నాట్యాచార్యుడు ఎం. కాశీ విశ్వనాథ్ పర్యవేక్షణలో మనోహరంగా నృత్యాలను ప్రదర్శించారు. పాలర్తి నాగేశ్వరరావు, వనమాలి, సురేష్ బాబు, పసుమర్తి పావని వాద్య సహకారం అందించారు. ప్రారంభ కార్యక్రమంలో సంగీత విద్వాంసులు కందుల లక్ష్మీనరసమ్మ, పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ్, లంకా భవానీ, పి. కేదారనాథ్, ప్రవాసాంధ్ర తెలుగు ప్రముఖులు శ్రీశ, సుధలక్ష్మి పాల్గొని యువ నృత్య కళాకారుడు శ్రీవత్సను అభినందించారు. విశ్రాంత బ్యాంక్ అధికారి యడవల్లి నాగేశ్వరరావు నిర్వహించారు.



భరతనాట్యం అంశాలను ప్రదర్శిస్తున్న శ్రీవత్స

క్లుప్తంగా

పన్ను చెల్లింపులకు నెలాఖరు వరకే గడువు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర ప్రజలు వీఎంసీకి చెల్లించే వివిధ పన్నులు వడ్డీ పడకుండా చెల్లించేందుకు ఈ నెల 30వ తేదీనే ఆఖరు గడువని వీఎంసీ డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి. సృజన శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలందరూ తమ ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను, డ్రెయినేజీ పన్ను, నీటి పన్ను సకాలంలో చెల్లించవలసిందిగా ఆమె సూచించారు. పన్నులు చెల్లించని వారికి జూలై ఒకటో తేదీ నుంచి వడ్డీ పడుతుందని, నగర ప్రజలందరూ వడ్డీ పడకుండా, సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని ఆమె సూచించారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు శుక్రవారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. గుణదలకు చెందిన టి.లలితానంద్ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఈ సందర్భంగా ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.1,01,116 విరాళాన్ని అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించగా, ఆలయ ఈవో శీనానాయక్ దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.

మాస్టర్ ప్లాన్ పనులపై సమీక్ష



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన మాస్టర్ ప్లాన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులపై ఈవో శీనానాయక్ ఆలయ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని ఈవో చాంబర్‌లో శుక్రవారం ఇంజినీరింగ్ విభాగానికి చెందిన డీఈలు, ఏఈలు, ఇతర సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు. ఈ నెల 23వ తేదీన ఆలయ అభివృద్ధి పనులపై దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలతో సమీక్ష సమావేశం జరగనుందన్నారు. ఆలయానికి సంబంధించి ఇప్పటి వరకు జరిగిన పనులు, రానున్న రెండు, మూడు నెలలో ఏ మేరకు పనులు పూర్తయ్యే అవకాశాలున్నాయనే అంశాలతో ఈ సమీక్షకు అధికారులందరూ హాజరు కావాలన్నారు. మాస్టర్ ప్లాన్ పనులు మరింత వేగంగా పూర్తయితే రానున్న దసరా, భవానీ దీక్షలకు భక్తులకు మరిన్ని సదుపాయాలను కల్పించవచ్చని ఈవో శీనానాయక్ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు.

10న గురుపౌర్ణమి వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో వచ్చేనెల 10వ తేదీ గురువారం గురుపౌర్ణమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీర మోహనరావు తెలిపారు. స్థానిక శ్రీదత్తసాయి మందిరంలో శుక్రవారం గురుపౌర్ణమి మహోత్సవ ఆహ్వాన కరపత్రాలను ఆయన భక్తులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తేదీ ఉదయం 5.30 గంటలకు కాగడ హారతితో గురుపౌర్ణమి ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఉదయం ఏడు గంటలకు 21 దివ్యద్రవ్యాలతో బాబావారికి అభిషేకం, అన్నాభిషేకం జరుగుతుందన్నారు. ఉదయం తొమ్మిది నుంచి 12గంటల వరకు శ్రీసాయి నక్షత్రమాలిక మండలి వారిచే శ్రీసాయినామ సంకీర్తన, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరుగుతుందని చెప్పారు. సాయంత్రం బాబావారి పల్లకీ ఉత్సవం, రాత్రి తొమ్మిది గంటలకు శేజ్‌హారతితో గురుపౌర్ణమి ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. కావున భక్తులు గురుపౌర్ణమి ఉత్సవాల్లో పాల్గొని బాబావారిని దర్శించుకుని ఆయన కృపకు పాత్రులు కావాల్సిందిగా కోరారు.

33 మందికి జరిమానా

విజయవాడలీగల్: నగరంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 33మందికి న్యాయస్థానం జరిమానా విధించింది. విజయవాడ నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు నగరంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 33మందిపై ఐదో ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. 33 మందిని కోర్టులో హాజరుపరచగా, ఆరవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి లెనిన్‌బాబు 14 మందికి ఒక్కొక్కరికీ రూ. 15వేలు చొప్పున, మిగిలిన 19మందికి ఒక్కొక్కరికీ రూ. 10వేలు చొప్పున జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీచేశారు. ప్రతిరోజూ ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారికి మోటారు వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదుచేస్తామని పోలీసులు హెచ్చరించారు.

జాతీయ రహదారిపై వెలగని లైట్లు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంకలోని వారధి పరిసరాల్లో జాతీయ రహదారిపై విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో అంధకారం అలముకుంది. కనకదుర్గ వారధి, వారధి ఫ్లైఓవర్‌పై గత కొన్ని రోజులుగా రాత్రి వేళల్లో కొన్ని విద్యుత్ దీపాలు వెలగడంలేదు. దీంతో వాహనదారులు రాకపోకల సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రాత్రి వేళల్లో వారధి మీదుగా వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. లైట్లు వెలగకపోవడంతో వాహనాల లైట్లు, ట్రాఫిక్ సిగ్నల్స్, రేడియం స్టిక్కర్లు ఆధారంగా వాహనదారులు ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. సరైన కాంతి లేకపోవడంతో వారధిపై, ఫ్లైఓవర్‌పై తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. తెల్లవారుజాము 4 గంటలు అయితే చాలు జాతీయ రహదారిపై లైట్లు అన్నింటినీ ఆపేస్తున్నారు. ఆ సమయంలోనే ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి హైవేపై అన్ని లైట్లు వెలిగేలా చూడాలని, తెల్లవారే వరకు లైట్లన్నీ వేసి ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.



వారధి పరిసరాల్లో అలముకున్న అంధకారం

ప్రహరీ నిర్మాణ పనులు పునఃప్రారంభం

సాక్షి ఎఫెక్ట్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్థానిక జమ్మిచెట్టుసెంటర్ సమీపంలోని కరెంట్ భావి దగ్గర ఉన్న మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన స్థలానికి ప్రహరీ నిర్మాణ పనులు పునఃప్రారంభమయ్యాయి. ఇక్కడ ఉన్న కార్పొరేషన్ స్థలాన్ని స్థానికులు తమ వాహనాలను పార్కింగ్ స్థలంగా ఉపయోగించుకుంటున్నారు. అంతేకాకుండా సాయంత్రం అయితే చాలు సమీప ప్రాంతాల్లోని యువకులు ఇక్కడకు చేరి మద్యం, మత్తు పదార్థాలు సేవిస్తున్నారు. ఈ స్థలంలో తోపుడుబండ్లను పెట్టి ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఈ విషయాలను వివరిస్తూ గతంలో 'సాక్షి'లో ప్రచురించిన వార్తకు కార్పొరేషన్ అధికారులు స్పందించి సుమారు రూ.5 లక్షల అంచనా వ్యయంతో ప్రహరీ నిర్మాణానికి టెండర్లు పిలిచారు. పనులు ప్రారంభించిన వెంటనే స్థానికంగా ఉండే టీడీపీ నాయకులు వచ్చి స్థలం ఆక్రమణకు గురైందని, సర్వే చేసిన తర్వాతే గోడ నిర్మాణ పనులు ప్రారంభించాలని చెప్పి పనులు నిలిపివేయించారు. ఈ ఏడాది జనవరి పనులు నిలిపివేశారు. అప్పటి నుంచి సర్వే చేయలేదు ప్రహరీ నిర్మాణ పనులు మొదలు పెట్టలేదు. దీనివల్ల ఈ ప్రాంతంలో మందుబాబుల ఆగడాలతో పాటుగా ఆక్రమణలు పెరుగుతున్నాయి. ఈ విషయాలను వివరిస్తూ మే 7వ తేదీన 'ఈ స్థలానికి రక్షణ కావలెను' శీర్షికతో సాక్షి పత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై కార్పొరేషన్ అధికారులు స్పందించి సర్వే పనులు పూర్తి చేయడంతో ప్రహరీ నిర్మాణ పనులు పునఃప్రారంభం అయ్యాయి. గతంలో వేసిన పిల్లర్ల కంటే కొంచెం ముందు భాగంలో పిల్లర్లు వేసే పనులు జరుగుతున్నాయి.



ప్రహరీ నిర్మాణానికి పిల్లర్లు వేసిన దృశ్యం

22న క్రియా యోగా సాధన

పటమట(విజయవాడతూర్పు): క్రియాయోగ సాధనతో జీవితం ఆనందమయంగా మారుతుందని యోగదా సత్సంగ సొసైటీ (వైఎస్ఎస్) ఉపాధ్యక్షుడు స్వామి స్మరణానంద అన్నారు. క్రియాయోగం అనేది ప్రతి మనిషి తనలోని దివ్యత్వాన్ని అనుభూతి చెందే శాస్త్రీయ విధానమని చెప్పారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు విజయవాడకు వచ్చిన ఆయన పటమటలోని వైఎస్ఎస్ ధ్యాన కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన ఉదయం 9.30 గంటలకు నగరంలోని శివరామకృష్ణ క్షేత్రంలో క్రియాయోగాపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. క్రియాయోగ ధ్యానంతో ఆనందమైన జయప్రదమైన జీవితం అనే అంశంపై తాను ప్రసంగిస్తానని తెలిపారు. ఆదివారం జరిగే కార్యక్రమంలో పాల్గొవాలనుకునే వారు 9848125539, 9440908788లో సంప్రదించాలని విజయవాడ వైఎస్ఎస్ ధ్యాన కేంద్రం సమన్వయ కర్త వి. మౌలంకర్ కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్మరణానంద

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన వాగ్దేవి కూచిపూడి నృత్యాలయానికి చెందిన పలువురు కళాకారులు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై నాట్యాచార్య ఎస్. శివకుమార్ పర్యవేక్షణలో 24 మంది చిన్నారులు పలు కీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై నిర్వహించిన నృత్య ప్రదర్శనను భక్తులు ఎంతో ఆసక్తితో వీక్షించారు. నృత్య ప్రదర్శన అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందించారు.

లక్ష్మీనగర్‌లో వరుస చోరీలు

రెండు ఇళ్లల్లో బంగారం, నగదు చోరీ

సత్యనారాయణపురం(విజయవాడపశ్చిమ): స్థానిక సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి వరుసగా రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. పంచాయతీ రాజ్ శాఖ రిటైర్డ్ డీఈ కేవీ రమాదేవి సత్యనారాయణపురం, లక్ష్మీనగర్ కాలనీలోని ఎల్ఆర్‌డబ్ల్యూఏలో ప్లాట్ నంబర్ 370లో నివాసం ఉంటుంది. ఇటీవలే ఆమె కెనడాలో ఉంటున్న కూతురు వద్దకు వెళ్లింది. శుక్రవారం ఉదయం పనిమనిషి ఇంటికి వెళ్లగా ఇంటి తలుపులు పగులగొట్టి ఉండటంతో వెంటనే నగరంలోనే ఉంటున్న రమాదేవి చెల్లికి ఫోన్ చేసి చెప్పింది. దీంతో ఆమె వచ్చి లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న రూ. 50వేల నగదు, రెండు బంగారు ఉంగరాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. అదేవిధంగా వారి ఇంటి సమీపంలోనే ఎల్ఆర్‌డబ్ల్యూఏలో నివాసం ఉంటున్న కోడే కోటేశ్వరరావు నివాసంలో కుటుంబ సభ్యులు నిద్రించిన సమయంలో దొంగలు చొరబడి బీరువాలోని రూ. 10వేలు చోరీ చేశారు. దీనిపై బాధితులు ఇరువురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఎన్‌పురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



లక్ష్మీనగర్‌లోని రమాదేవి ఇంట్లో చిందరవందరగా పడేసిన బీరువాలోని దుస్తులు

ప్రభుత్వాస్పత్రిలో పలువురు అధికారుల బదిలీ

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వం నిర్వహించిన సాధారణ బదిలీల్లో ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న పలువురు అధికారులు బదిలీ అయ్యారు. అందులో భాగంగా అడ్మినిస్ట్రేషన్ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కె. విజయలక్ష్మి రాజమండ్రి జీజీహెచ్‌కు బదిలీ అయ్యారు. డెప్యూటీ ఆర్ఎంఓలుగా పనిచేస్తున్న డాక్టర్ యు. శోభ ఏలూరు జిల్లా డీఐఓగా, డాక్టర్ శ్రీనివాసరాజు గుంటూరు జీజీహెచ్ డీసీఎస్ ఆర్ఎంఓగా బదిలీ అయ్యారు. ఆర్థోపెడిక్ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ శ్యామ్‌కుమార్ మచిలీపట్నం బదిలీ కాగా, కార్డియాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ శ్రీకాంత్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కావ్య విశాఖపట్నం బదిలీ అయ్యారు.